ప్రజాశక్తి
ఆదివారం 19 జనవరి 2025
అనంతపురం



ఎస్పీని కలిసిన తాడిపత్రి ఎఎస్పీ



ఎస్పీకి బొకే అందజేస్తున్న తాడిపత్రి ఎఎస్పీ

అనంతపురం క్రైం : తాడిపత్రి ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రోహిత్‌కుమార్ చౌదరి శనివారం అనంతపురంలోని కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేశారు. 2022 బ్యాచ్‌కు చెందిన రోహిత్‌కుమార్ రాష్ట్ర గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా పని చేశారు. ఇటీవల ప్రభుత్వం చేసిన బదిలీల్లో తాడిపత్రి ఎఎస్పీగా నియమించారు. దీంతో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లాకేంద్రంలో ఉన్న ఎస్పీ పి.జగదీష్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సోషలిజంతోనే ప్రజాస్వామ్యం

పెట్టుబడీదారీ వ్యవస్థతో వినాశనమే
కార్పొరేట్, మతతత్వాన్ని వ్యతిరేకిద్దాం
'పెట్టుబడి- ప్రజాస్వామ్యం' సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజల జీవన విధానాన్ని పెట్టుబడిదారీ విధానం నాశనం చేస్తుందని ఇలాంటి పరిస్థితుల్లో సోషలిజంతోనే నిజమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించుకోగలమని వక్తలు పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతి ముగింపు సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'పెట్టుబడి- ప్రజాస్వామ్యం' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్యవక్తలుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ లెనిన్ గొప్ప విప్లవ యోధుడని జీవితమంతా సమాజంలో పేదరికం నిర్మూలన కోసం పోరాడారని చెప్పారు. లెనిన్ 54 ఏళ్ల జీవితంలో 37 ఏళ్లు అజ్ఞాతం, జైలు జీవితం గడిపారని జీవితమంతా సమాజం కోసమే జీవించారని తెలిపారు. రష్యా విప్లవం విజయవంతం అయ్యే 4 ఏళ్ల మునుపు కార్మికుని ఇంట్లో ఉంటూ దగ్గరుండి పోరాటాన్ని నడిపారని తెలిపారు. లెనిన్ వంటి గొప్ప విప్లవయోధుడికి కూడా విమర్శలు ఎదురయ్యాయని తెలిపారు. సంక్షోభం ఏర్పడి ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న సమయంలో సమజాన్ని సొసలిజం వైపు నడిపారని తెలిపారు. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం పట్ల లెనిన్ కమ్యూనిస్టుల వైఖరిని స్పష్టం చేశారని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యం అందరికి సమానం అని చట్టం అందరి దృష్టిలో సమానం అని చెప్పినా ఆస్తి కలిగిన వర్గాల చేతుల్లో ఆయుధంగానే ఉంటుందని చెప్పారని నేడు అది చూస్తున్నామని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థ అదనపు సంపాదన కోసం వినాశక మార్గాలను అనుసరించి అన్ని వ్యవస్థలను నాశనం చేస్తుందని చాటారని తెలిపారు. దేశంలో మోదీ పెట్టుబడిదారీ వ్యవస్థకు సరైన ప్రతినిధిగా ఉన్నాడని, మతతత్వ విధానం మరొక ఆయుధం అని అన్నారు. హిట్లర్‌కు ఉన్న కొన్ని లక్షణాలు మోది కలిగి ఉన్నారని తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ నియంతృత్వ స్థాయికి చేరుకుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రయివేటు పెట్టుబడిదారులను ప్రోత్సహించి కొద్ది మంది చేతుల్లో పెట్టుబడి కేంద్రీకృతం చేసి పేదరికానికి కారణమౌతుందన్నారు. కావున కార్పొరేట్ మతోన్మాద వ్యవస్థ వ్యతిరేకంగా ఉద్యమించి సొషలిజం వైపు నడిపించడమే లెనిన్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రపంచ రూపురేఖలు మార్చిన గొప్ప విప్లవకారుడు, గొప్ప ప్రజాస్వామిక వాది సమాజానికి దిక్సూచి లెనిన్ అని కొనియాడారు. పెట్టుబడిదారీ వ్యవస్థ కేలం లాభాపేక్ష ఒక్కటే చూస్తుందన్నారు. 400 ఏళ్ల క్రితం వచ్చిన పెట్టుబడిదారీ వ్యవస్థ అనేక వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. ప్రపంచానికి సమాజానికి న్యూక్లియర్ అణుబాంబులను పెట్టుబడిదారీ వ్యవస్థ ఇచ్చిందని, నిరుద్యోగం సమస్య సృష్టించిందని, అభివృద్ధి మాటున ప్రకృతిని నాశనం చేసిందని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థను రూపుమాపి నిజమైన ప్రజాస్వామ్యం వ్యవస్థ స్థాపనకు సొసలిజం ఒక్కటే మార్గం అన్నారు. దేశంలో రాష్ట్రంలో కూడా పాలకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు మతతత్వ విధానాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. ఫాసిస్టు శక్తులుగా మారకముందే ప్రజలు చైతన్యంతో ఎదుర్కొవాలంటే సొషలిజం స్థాపించుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ లెనిన్ శత వర్ధంతి సందర్బంగా సంవత్సర కాలం పాటు సిపిఎం ఆధ్వర్యంలో అనేక చైతన్య కార్యక్రమాలు సదస్సులు నిర్వహించామన్నారు.

వైసిపిలో సంస్థాగత మార్పులు.. ?

పాతనేతల పునరాగమనం జరిగేనా ..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఉమ్మడి జిల్లాలో ఘోర ఓటమిని చవిచూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరిగి పార్టీని పునరుత్తేజం చేయడంపై పార్టీ అధిష్టానం దృష్టి సారించినట్టు తెలుస్తోంది అందుకు అనుగుణమైన మార్పులను చేపట్టే యోచనలోనున్నట్టు చర్చ నడుస్తోంది. పాత నేతలను తిరిగి పార్టీలోకి పునరాగమనం చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. వారిని తీసుకురావడం ద్వారా పునరుత్తేజం చేయవచ్చునని భావిస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. ఈ మేరకు ముందుగా ఇప్పుడున్న సమన్వయకర్తలు అంత యాక్టివ్‌గా లేని చోట దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా శింగనమల నియోజకవర్గంలో సమన్వయకర్తగా వీరాంజినేయులు ఎన్నికల అనంతరం నుంచి కనిపించడం లేదు. ఆర్థికంగా అంతగా లేని ఆయన తిరిగి ఆయన పాత వృత్తిలోకి వెళ్లినట్టు సమాచారం. ఇప్పుడు ఆలూరు సాంబశివారెడ్డే కొంత వరకు చూస్తున్నా అంత యాక్టివ్‌గా కనిపించడం లేదు. దీంతో ఆ నియోజకవర్గంలోకి మాజీ మంత్రి, కాంగ్రెసు నాయకులు డాక్టర్ శైలజనాథ్‌ను వైసిపిలోకి తీసుకునే యోచన నడుస్తోంది ఈ మేరకు ఆయన కూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డిని ఇటీవల కర్నూలులో కలవడం బలాన్ని చేకూరుస్తోంది. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డితోపాటు, తాడిపత్రి వైసిపి సమన్వకర్త పెద్దారెడ్డి మద్దతు కూడా శైలజనాథ్‌కే ఉన్నట్టు తెలుస్తోంది. ఇక రాయదుర్గానికి సంబంధించి మెట్టుగోవిందరెడ్డి ఉన్నారు. మృదుస్వభావి అయిన ఆయన ఎన్నికల్లో ఓటమి తరువాత నుంచి పెద్దగా యాక్టివ్‌గా లేరు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని తిరిగి వైసిపిలోకి తీసుకునే ఆలోచనలు నడుస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇక రాప్తాడుకు సంబంధించి కూడా మార్పు జరిగే అవకాశముందని పెద్దఎత్తున ప్రచారం నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి స్థానంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను తీసుకొస్తే ఎలాగుంటుందని యోచిస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. హిందూపురం సమన్వయకర్త దీపిక, కదిరి సమన్వయకర్త మక్బుల్, పుట్టపర్తి సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కూడా ఎన్నికల అనంతరం నుంచి పెద్దగా కదలికల్లేవు. మౌనంగా ఉంటూ వస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లోనూ కొత్త నాయకత్వాన్ని తీసుకొచ్చే ఆలోచనలు నడుస్తున్నాయి. ఈ మేరకు అనంతపురం జిల్లా నేతల సమావేశంలోనే పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కూడా వెల్లడించినట్లు సమాచారం. ఎక్కడైతే నియోజకవర్గ సమన్వయకర్తలు యాక్టివ్‌గా లేకపోతే అక్కడ కొత్తవారొస్తారని చెప్పియున్నారు. దీంతో పార్టీలో మార్పులు జరిగే అవకాశాలున్నాయన్న ప్రచారం మరింత జోరుగా సాగుతోంది. కాంగ్రెసు పార్టీలో బలంగా ఉంటూ తరువాత సైలెంట్‌గానున్న సీనియర్ నాయకులను వైసిపిలోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చనడుస్తోంది. వారు రావడం ద్వారా అధికార టిడిపి కూటమిని గట్టిగా ఎదుర్కొనే బలాన్ని సాధించవచ్చునన్న ఆలోచనలోనూ పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా వైసిపిలో మార్పులు అనివార్యమయ్యే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి.

స్వచ్ఛ అనంతపురం జిల్లాగా తీర్చిదిద్దుదాం

కలెక్టర్ డాక్టర్. వినోద్ కుమార్



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - ఉరవకొండ

సమిష్టిగా పనిచేసి స్వచ్ఛఅనంతపురం జిల్లాగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ లో భాగంగా శనివారం ఉరవకొండ నియోజకవర్గంలో పలు అభివద్ధి కార్యక్రమాలలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారాన్ని స్వచ్ఛ్ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ గా పాటించాలని ఆదేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసి జిల్లాలో ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధులతో కలిసి మనవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయడం జరిగిందని ఇది చాలా మంచి కార్యక్రమం అని చెప్పారు. ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి పొడి చెత్త తడి చెత్తను సేకరించి చెత్త నుండి సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లను ఏప్రిల్ నాటికి ప్రారంభించబోతున్నామని ప్రతి ఒక్కరూ దీనిలో భాగస్వాములు కావాలని చెప్పారు. అలాగే జిల్లాలోని ఉద్యానవన పంటల సాగు చేసేటప్పుడు ప్యాకింగ్ ప్లాస్టిక్ పేపర్లను డంప్ చేయడం జరుగుతుందని, అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల నందు పనిచేసే చోట ఇంటిగ్రేటెడ్ హౌస్ హోల్డ్ టాయిలెట్స్ ఇంటిగ్రేటెడ్ సేనిట్రీ కాంప్లెక్స్ ఉండేలా చూడాలని సూచించారు. ఉరవకొండ తహశీల్దార్,ఎంపీడీవో కార్యాలయాల ఆవరణాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద ఒక్కొక్కదానికి రూ. 72,629 వేల రూపాయల చొప్పున రూఫ్ రెయిన్ వాటర్ హెరోస్టింగ్ ట్యాంకును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలోని వీఆర్వోల గదిని పరిశీలించారు. కార్యాలయం శుభ్రంగా ఉంచుకోవాలని నిరుపయోగంగా ఉన్న వస్తువులను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఉరవకొండ ఆవరణంలో ఉపాధి హామీ పథకం కింద రూఫ్ రెయిన్ వాటర్ హెరోస్టింగ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పారిశుద్యకార్మికులతో సెల్ఫీలు దిగి, వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. వేతనాలు సక్రమంగా వస్తున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ ఆర్డీవో, జిల్లా పరిషత్ సీఈవో ,బిసి వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, డిపిఒ నాగరాజు, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవి ప్రసాద్, ఐసిడిఎస్ సీడీపీవో శ్రీదేవి, ఈవోఆర్డీ సతీష్ కుమార్, ఉరవకొండ ఈవో గౌస్ సాహెబ్, ఏపీవో విమల, సర్పంచి లలిత తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలింపునకు స్థలం కేటాయించండి
జెసి శివ్‌నారాయణ్‌శర్మకు ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలో ఉన్న డంపింగ్ యార్డు తరలింపునకు నగర సమీపంలో అనువైన స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జెసి శివ్‌నారాయణ్‌శర్మను కలిసి విన్నవించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను జెసి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అనంతపురం డంపింగ్ యార్డ్ సమస్యపై చర్చించారు. డంపింగ్ యార్డులో రోజురోజుకూ చెత్త పెరిగిపోతోందన్నారు. తద్వారా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రకాలుగా ఇబ్బందిగా ఉన్న డంపింగ్ యార్డు సమస్యకు సరైన పరిష్కారం తరలించడమే అన్నారు. కావున నగర సమీపంలో డంపింగ్ యార్డ్ కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు జెసి సానుకూలంగా స్పందించారు.



మాట్లాడుతున్న జిల్లా రవాణా డిప్యూటీ కమిషనర్ ఎం.వీర్రాజు

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి
జిల్లా రవాణా డిప్యూటీ కమిషనర్ ఎం.వీర్రాజు

ప్రజాశక్తి-అనంతపురం

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణా డిప్యూటీ కమిషనర్ ఎం.వీర్రాజు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, అనంతపురం నెహ్రూ యువ కేంద్ర ఈనెల 17 నుంచి 23వతేదీ వరకూ నిర్వహించనున్న రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా జిల్లాలో దాదాపు 30 మందికిపైగా రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందారన్నారు. అదే రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుంటే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కావున ప్రతి ఒక్కరూ రోడ్డు చిహ్నాలు, తృతీయ పార్టీ బీమా ప్రాధాన్యత, ప్రమాదాలకు కారణాలు, డ్రైవింగ్ అలవాట్లు, పద్ధతులపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత వారోత్సవాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రఘుప్రసాద్, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వేణుగోపాల్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.జయమారుతి, యువజన జాగృతి సొసైటీ అధ్యక్షులు వెంకటేష్, మై భారత్ యూత్ వాలంటీర్స్ 25 మంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



పరుగుపందెంలో పాల్గొన్న కానిస్టేబుల్ అభ్యర్థులు

జిల్లాలో పారదర్శకంగా పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహధారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయమే స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో అభ్యర్థులకు దేహధారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎస్పీ పి.జగదీష్ దగ్గర ఉండి సిసి కెమెరాల పర్యవేక్షణలో దేహధారుఢ్య పరీక్షలు పారదర్శకంగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డ్ నియమ నిబంధనలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బంధీగా దేహధారుఢ్య పరీక్షలను నిర్వహించారు. ఎత్తు, ఛాతీ కొలతలు అనంతరం 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షల్లో పురుష అభ్యర్థులు పాల్గొన్నారు.

కనిపించని సం'క్రాంతి'

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంత వీక్షణం

సంక్రాంతి అంటూనే రైతుల పండుగ. పంట చేతికొచ్చిన సమయంలో జరిగే ఈ పండుగ అంటే పల్లెల్లో ఎక్కడ లేని సందడి కనిపిస్తుంది. రాష్ట్రంలో ఇదే సందడి పలు చోట్ల కనిపించింది. ప్రధానంగా కోస్తా ప్రాంతంలో ఈ పండుగ సందడి అంతా..ఇంతా కాదు. నగరాలు, పట్టణాలకు వలసలు వెళ్లిన వారందరూ స్వగ్రామాలకు చేరడంతో ఆ పండుగ సందడి అంబరాన్ని అంటే విధంగా సాగింది. ఇది మీడియా, సోషియల్ మీడియాలోనూ పెద్దఎత్తున కనిపించింది. కోడి పందేలు, రికార్డు డ్యాన్సు ఇలా ఆ సందడి రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనూ చర్చ జరిగే విధంగా చేసింది. కాని అనంతపురం జిల్లాలోని పల్లెల్లో చూస్తే పండుగ రోజు కూడా ఊసురు మనిపించే విధంగా సాగిందని చెప్పవచ్చు. ఈ వారంలో మూడు రోజులు పండుగ జరిగితే ఎక్కడా ఆ సందడి కనిపించలేదు. కేవలం ఇళ్లలోకే పరిమితమై సాగింది. ఆ ప్రాంతాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారందరూ చేరుకుని సందడి చేయగా ఇక్కడ మాత్రం ఉపాధికెళ్లిన వారు కూడా స్వగ్రామాలకు రాలేదు. ఎందుకంటే ఈ ఏడాది పంటలు ఆశించినంత రైతుకు రాలేదు. ఒకవైపు వర్షాభావం...మరోవైపు అధిక వర్షాలు రెండూ కలిపి రైతుకు నష్టాలనే మిగిల్చాయి. పండిన అరకొర పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతు అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. వేరుశనగ, కంది పంట, వరి, పత్తి ఇలా అన్ని పంటలు చేతికొచ్చినా కొనుగోళు జరగలేదు. ప్రభుత్వం కొనుగోలు చేస్తామన్న ప్రకటన చేసి పేర్ల నమోదుకే పరిమితమైంది. ఇక మిరప పంటను కొనే దిక్కేలేదు. పక్క రాష్ట్రమైన కర్నాటకకు వెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది. ఇన్ని కష్టాల నడుమ పల్లె పండుగ సందడి గ్రామాల్లో కనిపించలేదు. ఇలా ఈ వారంలో పండుగ సందడి కనిపించకుండానే సాగిపోయింది. ఇక ఈ వారంలో ప్రధానంగా చర్చకొచ్చిన అంశం తాడిపత్రిలో ఒక వ్యక్తితో మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆడియో లీక్‌కు సంబంధించి. సదరు వ్యక్తి కో ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు, పోలీసుల పట్ల మాట్లాడిన తీరు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. దీనిపై పోలీసులు సైతం నిశితంగా దృష్టి సారించారు. ఇక వన్‌టౌన్‌లో సాఫ్టువేరు ఉద్యోగి పట్ల కానిస్టేబుల్ దురుసుగా వ్యవహరించిన అంశం కూడా చర్చనీయాంశమైంది. సదరు కానిస్టేబుల్‌పై ఎస్పి జగదీశ్ చర్యలు కూడా తీసుకున్నారు. ఇక వైసిపిలో బిసి నేతలు అలజడి రేపుతున్నారు. ప్రధానంగా రాప్తాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్పు జరుగుతుందని వస్తున్న ప్రచారం పెద్ద దుమారేమే రేపుతోంది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని కాదని హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌కు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తారన్న ప్రచారంలో వాస్తవమెంతోగాని రాజకీయంగా మాత్రం పెద్ద చర్చనీయాంశమే అయింది. దీనిపై వారిద్దరుగాని, ఇతర నేతలుగాని పెదవి విప్పనప్పటికీ ఆ పార్టీలో కొన్ని మార్పులు అనివార్యమయ్యే సూచనలుండే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఎన్టీఆర్‌తోనే బీసీల్లో రాజకీయ చైతన్యం



జిల్లావ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు రక్తదాన శిబిరాలు, దుస్తులు పంపిణీ, అన్నదానాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ధైర్యంగా ముందుకెళ్లాలి

అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

'మీ ఆరోగ్యంపై అధైర్య పడొద్దు.. ఆరోగ్యాం కాపాడుకుంటూ ఆత్మవిశ్వాసంతో జీవించాలి' అంటూ అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పిలుపునిచ్చారు. శనివారం అనంత నెట్వర్క్ ఆఫ్ పాజిటివ్స్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఐఎంఎ హాలులో హెచ్‌ఐవితో జీవిస్తున్న పిల్లలు 50 మంది, తలసీమియాతో బాధపడుతున్న 30 మంది పిల్లలకు చైతన్య కళావతి నంద్యాల సహకారంతో గైడ్‌లు, లాంగ్ నోట్‌బుక్స్, జామెంట్రీ బాక్స్, పెన్నులు, పెన్సిల్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, పౌష్టికాహారం, కిరాణా సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ మీరందరూ స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న సేవలను ఉపయోగించుకుంటూ మంచి విద్యావంతులుగా ఎదగాలని సూచించారు. అలాగే ఇలాంటి పిల్లలపై సమాజం వివక్షత చూపకూడదన్నారు. అదేవిధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న అనంత నెట్వర్క్ ఆఫ్ పోసిటివ్స్ సంస్థ, చైతన్య కళావతి నంద్యాల వారిని మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వనజ, ఐఎంఎ కోశాధికారి డాక్టర్ సుప్రజా, సెక్రటరీ డాక్టర్ నిరంజన్‌రెడ్డి, చైతన్య కళాభారతి నంద్యాల డైరెక్టర్ విజయ్ భాస్కర్, చైతన్య కళాభారతి కోఆర్డినేటర్ వరలక్ష్మి, అనంత నెట్వర్క్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ స్వేచ్ఛ కంటే గౌరవం ముఖ్యం

బీఎస్పీ ఎపి కోఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు



మాట్లాడుతున్న డీఎస్పీ ఎపి కో ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి-అనంతపురం

నాడు పెరియార్ చెప్పినట్టు రాజకీయ ప్రాధాన్యం కంటే స్వాభిమానం, గౌరవం చాలా ముఖ్యమని బహుజన పార్టీ ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు తెలిపారు. శనివారం అనంతపురం బీఎస్పీ, బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో 'మేమెంతో - మాకంత' అనే నినాదంతో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణనపై నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా బీసీ నేతలు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తమిళనాడు నుంచి ఆంధ్ర విభజన తర్వాత ఆంధ్ర తీవ్రంగా నష్టపోయిందన్నారు. కేవలం పెరియార్ మార్క్ బీసీ రాజకీయ వారసత్వం లేకపోవడమే వల్లే అలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. కేవలం కొన్ని సామాజిక వర్గాల చేతిలో రాష్ట్రం ఉండటంతో సంక్షేమం, అభివృద్ధి దూరంగా ఉంటున్నామన్నారు. అంబేద్కర్ సూత్రం ప్రకారం అందరి ఓటు సమానమే అయినా బీసీలకు మాత్రం ఎటువంటి రాజకీయ విలువ లేకుండా పోయిందన్నారు. 'ఓట్లు మీవి, సీట్లు మావి' అనే తరహాలో రాజకీయాలు కేవలం రెడ్లు, కమ్మల చేతుల్లో ఇరుక్కుపోయాయన్నారు. ప్రస్తుతం 29 ఎస్సి, ఏడుగురు ఎస్‌టిలు, 40 మంది బీసీ ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారన్నారు. ఈ సంఖ్య వందకు చేరితేనే బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేయటం సాధ్యమవుతుందన్నారు. కావున మనందరం ఆ దిశగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి లక్ష్యాలను కొనసాగించాలి

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎల్ఐసి జాతీయకరణ లక్ష్యాలను కొనసాగించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం రాయదుర్గం బ్రాంచి అధ్యక్షులు శేషగిరి, కార్యదర్శి క్రిష్ట భూషణ్, శ్రామిక మహిళా కన్వీనర్ మహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జనవరి 19వతేదీతో ఎల్ఐసిని జాతీయకరణ చేసి 69ఏళ్లు పూర్తవుతుందన్నారు. అప్పట్లో 245 ప్రయివేటు బీమా కంపెనీల మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకు వాటి స్థానంలో ఒక ప్రభుత్వ రంగ సంస్థగా ఎల్ఐసిని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ ఎల్ఐసిని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కేంద్రంలోని ప్రభుత్వంపై ఉందన్నారు. 69 ఏళ్లుగా 'ప్రజల సొమ్ము, ప్రజా సంక్షేమానికి' అనే నినాదంతో ఎల్ఐసి సంస్థ ముందుకు సాగుతోందన్నారు. ఆరోగ్యం, బీమా ప్రతి భారతీయుడికీ కనీస అవసరాలు అన్నారు. హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ భారాన్ని పూర్తిగా తొలగించాలన్నారు. ఎల్ఐసి దేశవ్యాప్తంగా ప్రత్యేక వ్యాపార దినంగా ప్రకటించిన జనవరి 20వ తేదీని జయప్రదం చేయాలని కోరారు. అనేక ఆకర్షణీయమైన నూతన పాలసీలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎల్ఐసిలో పాలసీలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై దృష్టి సారించాలి

ఎఐసిటిఇ సభ్యులు వాంఛనా సింగ్

ప్రజాశక్తి -అనంతపురం

సాంకేతిక విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై దృష్టి సారించాలని ఎఐసిటిఇ సభ్యులు వాంఛనాసింగ్ పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం జెఎన్‌టియు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో నేషనల్ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ జి.ప్రశాంతితో కలిసి మాట్లాడుతూ వివిధ అంశాలతో కూడిన వెబినార్ విద్యార్థులకు చాల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, వరంగల్ ఎన్ఐటి హరికుమార్ వోరుగంటి, మిట్స్ మదనపల్లి, రీజినల్ కోఆర్డినేటర్ జగదీష్‌బాబు, వివిధ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి నిధులు కేటాయించాలి

బిపిసిఎల్ ఎండికి ఎంపీ అంబికా వినతి



బిపిసిఎల్ ఎండికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపి అంబికా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రి క్యాజువాలిటీ వార్డు పునర్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈమేరకు శనివారం ముంబయిలో బిపిసిఎల్ సిఎండిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ పెద్దాసుపత్రిలోని క్యాజువాలిటీ వార్డు పునర్ నిర్మాణం కోసం రూ.1 కోటి సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ ప్రతిపాదనకు సిఎండి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే హెచ్పీసీఎల్, ఓఎన్‌జీసీ సంస్థలు కూడా వాటర్ ప్లాంట్ల కోసం నిధులను సమకూర్చేందుకు అంగీకరించడం మంచి శుభపరిణామం అన్నారు.

కూటమి నాయకుల ఎన్నికల హామీలపై పోరాటం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థాయి నుంచి పోరాటాలు చేయనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయడంలో సిఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ధనార్జనే ధ్యేయంగా కూటమి నాయకులు పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఎమ్మెల్యేల కనుసన్నల్లో పోలీసులు పనిచేయడం బాధాకరమన్నారు. క్షేత్రస్థాయిలో వైసిపి బలోపేతం చేస్తానమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ చేయవద్దని వైసిపి ప్రభుత్వంలోనే తీర్మానం చేశామని గుర్తు చేశారు. వైఎస్ జగన్ కృషి వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11500 కోట్లు మంజూరు చేశారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో విలీనం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల సమన్వయకర్తలు తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వీరాంజనేయులు, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికలు



కళ్యాణదుర్గంలో ఎన్నికైన వారికి డిక్లరేషన్ అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం మండల పరిధిలోని పాల్వాయి, గరుడపురం, మాణిరేవు, ఈస్ట్ కోడిపల్లి ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికలను శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా సంఘాల్లోని బోర్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గరుడాపురం ఎన్నికల అధికారిగా సమతారెడ్డి, మణిరేవు ఎన్నికల అధికారిగా డాక్టర్ బి.నవీన్‌కుమార్, పాళవాయి ఎన్నికల అధికారిగా డాక్టర్ రమేష్, ఈస్టు కోడిపల్లి ఎన్నికల అధికారిగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం, కళ్యాణదుర్గం మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ గొర్రెల,మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో వైసిపికి చెందిన వర్గీయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని సచివాలయం వద్ద శనివారం జరిగిన సంఘం ఎన్నికలలో అధ్యక్షుడిగా వైసిపికి చెందిన సిద్దప్ప రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా సుద్దల లక్ష్మీనారాయణలతో పాటుగా మరో ఏడు మందిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్ష,ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లను సర్పంచి ఆర్.గురుమస్తాన్, ఉప సర్పంచి రాముయాదవ్, వైసిపి నాయకులు సుద్దల సుధాకర్, వెంకటరాముడును శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సుద్దల రాముయాదవ్, బి.సురేష్, ఎస్.సురేష్, ఓబుళప్ప, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని గుద్దేకుంట గ్రామంలో కళ్యాణదుర్గం ఎలక్షన్ అధికారి పశు వైద్యులు డాక్టర్ పి.మంజునాథ్ ఆధ్వర్యంలో శనివారం గొర్రెల పెంపకం సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. సొసైటీ అధ్యక్షులుగా రమేష్, ఉపాధ్యక్షులుగా లక్ష్మన్నతోపాటు ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పశువైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి త్రిలోక్‌చంద్ జైన్ మృతి

పలువురి నివాళి



ప్రజాశక్తి-అనంతపురం

నగరానికి చెందిన మహాలక్ష్మి టెక్స్‌టైల్స్ అధినేత త్రిలోక్‌చంద్ జైన్ (92) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. జైన్ తన జీవితాంతం అత్యంత విలువలతో కూడిన వ్యాపారం చేస్తూ కొన్ని వేలమందికి ఉపాధి కల్పించారు. అంతేకాకుండా అనంతపురంతోపాటు అనేక ప్రాంతాలకు చెందిన సామాజిక కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాల నాయకులకు చేదోడు వాదోడుగా నిలుస్తూ వచ్చారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులు తండ్రి బాటలోనే పయనిస్తూ పలువురికి ఆపన్నహస్తం అందిస్తున్నారు. త్రిలోక్‌చంద్ జైన్ మూడేళ్ల క్రితం వచ్చిన కోవిడ్ సమయంలో ప్రజలకు అనేక సేవలు అందించారు. పెద్దాసుపత్రి వద్ద మూడునెలల పాటు అన్నదానం, మందులు, మాస్కులు అందించారు. ఈయన మృతితో పలు పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్, టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్, సిపిఎం రాష్ట్ర నాయకులు రాంభూపాల్, వైసిపి నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, గోనుగుంట్ల విజయభాస్కర్, తిరువేదుల జగదీష్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు దూపకుంట, తదితరులు సంతాపం తెలిపారు.

నడిరోడ్డుపై గుంత పూడ్చివేత

ప్రజాశక్తి కథనానికి స్పందన



జెసిబితో గుంతను పూడుస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని పసుపుల ఫ్యాక్టరీ వద్ద చెరువు కట్ట కింద అనంతపురం-తాడిపత్రి రహదారిపైన ఏర్పడిన గుంతను ఎట్టకేలకూ పూడ్చివేశారు. నడిరోడ్డుపై లోతైన గుంత ఉండటంతో 'ఆదమరిచారా.. అంతే' శీర్షికతో శనివారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన పంచాయతీ అధికారులు గుంతను తవ్వి రోడ్డులోపల ఉన్న పైపులైనుకు మరమ్మతులు చేసి గుంతను పూడ్చివేశారు. దీంతో స్థానికులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పార్వతి, ఇఒఆర్‌డి సదాశివ, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి

అనంతపురం రూరల్ : మహాలక్ష్మి టెక్స్‌టైల్స్ అధినేత త్రిలోక్‌చంద్ జైన్ అనారోగ్యం కారణంగా మృతిచెందడంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే గుండెపోటుతో మృతిచెందిన అనంతపురం 42వ డివిజన్ టిడిపి మైనారిటీ నాయకులు ఫక్రుద్దీన్‌కు నివాళులర్పించారు. ఇందులో భాగంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐటియు అనుబంధంగా శనివారం కొండమీదరాయుడుని ఆటో యూనియన్‌ను ఎన్నుకున్నారు. యూనియన్ ప్రెసిడెంట్‌గా సి నాగేంద్ర, వైస్ ప్రెసిడెంట్‌గా రాఘవరెడ్డి, సలహాదారులుగా పి.శ్రీనివాసులు, టి.పోతులయ్య, రామాంజి, కమిటీ సభ్యులుగా చిరంజీవి, కొండా, నాగరాజు, ఆసిత్, విశ్వనాథ, గోపీ, అశోక్, కుళ్లాయప్ప, భాస్కర్, లక్ష్మీనారాయణ, బాలు, బూసిను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ

అనంతపురం క్రైం : రూరల్ పరిధిలోని కక్కలపల్లి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందుతున్న వైద్య సౌకర్యాలను కేంద్ర బృందం పరిశీలించింది. ఇందులో భాగంగా జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల (ఎన్క్వాస్) ప్రతినిధుల బృందం సభ్యులు డాక్టర్ సవిత, డాక్టర్ అరవింద్ హెల్త్ క్లినిక్‌లో అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కురుగుంట పిహెచ్‌సి వైద్యాధికారి మనోజ్, డాక్టర్ సంధ్య, పిహెచ్ఎన్ సాంబశివమ్మ, ఎంపిహెచ్ఇఒ లక్ష్మన్న, సిహెచ్ఒ గౌరి, ఎఎన్ఎం శారద పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్త మృతికి నివాళి

గుత్తి : మండలంలోని బేతాపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్త తిరుపాలు(32) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి సీనియర్ నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి శనివారం మృతుని ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గంగరాజు, వైసిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని గుబనపల్లి వద్ద జరిగిన శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన తాహిర్, ఫారుక్ కుటుంబ సభ్యులను వైసిపి నియోజకవర్గ నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు శనివారం పరామర్శించారు. ఇందులో భాగంగా మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున కుటుంబ సభ్యులకు అందజేశారు. నివాళులర్పించిన వారిలో శెట్టూరు మండల జడ్పిటిసి మంజునాథ్, ఎంఎస్.రాయుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్‌లు దొడగట్ట నారాయణ, రామకృష్ణ, పూజారి పాలయ్య, నియోజకవర్గ గ్రీవెన్స్ అధ్యక్షులు వేముల గిరిబాబు, అదిశేషు, శ్రీనివాసులు, మంజునాథ్, తంజిల్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం కలెక్టరేట్ : ఎపి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలండర్‌ను జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్‌శర్మ శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కటిక జయరాం, ప్రధాన కార్యదర్శి రాజరమేష్, గౌరవాధ్యక్షులు ప్రకాష్ బాబు, లక్ష్మీనారాయణ, హృషికేస్, సునీల్ కుమార్, సాయిప్రియ, నరసింహులు, ఆంజనేయులు, గంగాధర్, నాగరాజు, శ్రీనివాసులు, మనోహర్, నాగప్ప, ఆదిశేషు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలి

ఉరవకొండ : ఉరవకొండలోని వీరశైవుల రుద్రభూమిలో కంపచెట్లను తొలగించడంతోపాటు ప్రహరీ, నీటి ట్యాంకు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని నియోజకవర్గ వీరశైవ సంఘం నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వీరశైవ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాటిల్ నాగన్నగౌడ్, పాటిల్ నిరంజన్‌గౌడ్, కోశాధికారి దేశాయ్ వీరేశ్, సీనియర్ నాయకులు మల్లికార్జున, మోపిడి చంద్రమౌళి, దేశాయ్ సురేష్, దేశాయ్ మహేష్, మేటి రవి, మేటి నాగరాజు, దేశాయ్ బండేష్, దేశాయ్ ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై సర్వే

బొమ్మనహాల్ : మండలవ్యాప్తంగా కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలని దర్గాహొన్నూర్ పిహెచ్‌సి డాక్టర్ సుల్తాన్ సూచించారు. శనివారం మండలంలోని బొమ్మనహాల్, శ్రీధరఘట్ట, దర్గాహొన్నూర్ పిహెచ్‌సిల పరిధిలో కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించాలన్నారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల 2వతేదీ వరకూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ : రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం కుష్టు వ్యాధిగ్రస్థుల సర్వేపై ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, ఆరోగ్య పర్యవేక్షకులు శేఖర్, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు, తదితరులుపాల్గొన్నారు.

ప్రజాపిత 56వ స్మృతి దినం

రాయదుర్గం : పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రజాపిత బ్రహ్మ 56వ స్మృతి దినం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయదుర్గం సంచాలకులు బికె యోగేశ్వరి ప్రజాపిత బ్రహ్మ జీవన గాథను వివరించారు. అలాగే ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కణేకల్ సంచాలకులు బికె రాధ, కమలాక్షి, లక్ష్మి, జ్యోతి, రచన, సిద్ధమ్మ, ఈశ్వరమ్మ, గోవింద, మహేష్, ప్రసాద్, ప్రకాష్, బద్రి, శివశంకర్, ప్రజలు పాల్గొన్నారు.

21న జర్నలిస్టు ప్రసాద్ సంస్మరణ సభ



అనంతపురం సిటీ : సీనియర్ పాత్రికేయులు దివంగత నందినేని దేవప్రసాద్ సంస్మరణ సభను ఈనెల 21న నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సి.విశ్వనాథ్, హెచ్.ఆజాద్, తలారి రామంజనేయులు, ఆర్.భోగేశ్వరరెడ్డి, రేపటి రామాంజనేయులు, కాలవ రమణ, షఫీవుల్లా, చల్లా కె నాయుడు, జంబుల రమేష్‌రెడ్డి, వి.నవీన్‌రెడ్డి, రవిచంద్ర, అనిల్‌కుమార్‌రెడ్డి, మారుతి, రామ్మోహన్ రావు, నందు భాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సభకు యూనియన్లకు అతీతంగా అన్ని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు హాజరుకావాలని కోరారు.

ఎన్టీఆర్ జీవితం ఆదర్శం

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు



రాయదుర్గంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేద, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన ఆదర్శనీయమైన శిఖరం మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు అని నాయకులు కొనియాడారు. శనివారం అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్‌టిఆర్ సర్కిల్, జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ క్యాక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టిడిపి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటశివుడు యాదవ్, శ్రీధర్‌చౌదరి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వాడి ఆత్మగౌరవం కోసం 42ఏళ్ల క్రితం ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన 9 నెలల్లోపే ముఖ్యమంత్రి అయ్యారని గుర్తు చేశారు. ఎన్టీఆర్‌ను మించిన నాయకుడు, నటుడు మరొకరు లేరన్నారు. ఇక భవిష్యత్ లో కూడా రాలేరన్నారు. బడుగు, బలహీన వర్గాలను చట్ట సభలకు పంపి రాజకీయం చైతన్యం తీసుకొచ్చారన్నారు. వీటితోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదలను ఆదుకున్నారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత, మంత్రి నారా లోకేష్ ముందుకు సాగుతున్నారన్నారు. కాగా ఆదర్శ్ నగర్‌లోని గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదలకు ఎమ్మెల్యే దగ్గుపాటి దోమతెరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం చేశారు.

కళ్యాణదుర్గం రూరల్ : నియోజకవర్గంలోని శెట్టూరు మండల కేంద్రం ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు తర్వాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్‌ఫెర్రర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాలనీవాసులకు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థాపించిన టిడిపి అంటేనే సామాన్యుల పార్టీ అన్నారు. టిడిపి ఆవిర్భావంతోనే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చిందని గుర్తు చేశారు. అనంతరం పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిలో ఉన్న నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం మండల కేంద్రంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా బస్టాండ్ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే చేరుకున్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పిఎల్ ఈశ్వర్‌రెడ్డి, నాయకులు అమ్మలదిన్నె శాలిని, చితంబరి దొర, మారుతీనాయుడు, దేగల కృష్ణమూర్తి, ఆకుల బాబు, పుచ్చకాయల రాము, అట్టే రామాంజనేయులు, జి.సత్యనారాయణ, కాయల రమణాయాదవ్, ఏకల ఆదినారాయణ, డ్రిప్పు ఓబులేష్‌నాయుడు, తిరుపాలు, శ్రీనివాసులు, శంకర, చంద్రాయుడు, మాసూల చంద్రమోహన్, జడేజా, మసూద్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య కొనియాడారు. ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకుని జెఎన్‌టియు పరిపాలన భవనంలో ఉన్న విగ్రహానికి, యూనివర్సిటీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి విసి ఎం.దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, యూనివర్సిటీ ఆచార్యులు బి.దుర్గాప్రసాద్, వివి.చిత్ర, ఎ.సురేష్‌బాబు, శోభాబిందు, కిరణ్మయి, నాగ ప్రసాద్‌నాయుడు, శివకుమార్, సిఇలు శంకర్ శేఖర్‌రాజు, అంకారావు, శిరాజుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, శ్రీనివాసులు, వివిధ విభాగాల అధిపతులు రామశేఖర్‌రెడ్డి, భువనవిజయ, మమత, కళ్యాణి రాధా, కళ్యాణ్‌కుమార్, ఓంప్రకాష్, భారతి, జరీన, మాజీ ఆచార్యులు వి.శంకర్, శివలింగరావు, డిప్యూటీ రిజిస్ట్రార్లు రంగానాయక్, మధుసూదన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు శశాంక్ చౌదరి, గడిపూడి నారాయణస్వామి, మనోరంజని, సూర్యనారాయణ, వేణుగోపాల్, అనమప్పచౌదరి, వడ్డే నాగేంద్ర, వెంకట్ నారాయణ, రామదాసు, అక్కులన్న, అంకే ఆనంద్, సుధాకర్‌రెడ్డి, కార్తీక్, సుబ్బర హరికుమార్, బొమ్మయ్య, లక్ష్మీదేవమ్మ, సరళ, సుజాత, ఆదెమ్మ, వడ్డే వసూరప్ప, చికెన్ వలి, ఉమాపతి, గుజ్జల అక్కులన్న, గుజ్జల రవీంద్ర, ఉపేంద్ర, ధనంజయ, వడ్డే సద్దానప్ప, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల టిడిపి నాయకులు మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అపంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రభాకర్‌చౌదరి, గౌస్ పీరా, జింకల సంజీవకుమార్, బొమ్మా మోహన్, రాజేష్‌నాయక్, నల్లబోతుల శీన, సుంకప్ప, తేల్ బాషా, అప్పన్నగారి కుమార్, శ్రీరాములు, రమణారావు, మహమ్మద్ రఫీ, వెంకటేష్, తిమ్మప్ప, రవి, గంపమల్లయ్య, ఖలందర్, తదితరులు పాల్గొన్నారు.



వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

నార్పల : టిడిపి కేంద్ర కార్యాలయంలో నందమూరి తారకరామారావు విగ్రహానికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు నివాళులర్పించారు.

రాయదుర్గం : ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని విగ్రహానికి విప్ కాలవ శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే టిడిపి యువ నాయకుడు కాలవ భరత్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని సీతారామాంజనేయ సత్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ఎన్టీఆర్ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించడమే కాక అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారన్నారు. కాగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భరత్, నాగరాజు, హనుమంతురెడ్డి, హనుమంతు, పురుషోత్తం, వెంకటేశులు, భారతి, ప్రశాంతి, సంపత్‌కుమారి, ఇంకా అనేక మంది నాయకులు కార్యకర్తలు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : ఎన్‌టిఆర్ 29 వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మఘట్ట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ, పట్టణ ,మండల కన్వీనర్లు ఎంకె.చౌదరి, బర్దివలి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, ఆర్.సాల్మన్‌రాజా, బోయ వేణుగోపాల్, బి.రమేష్, పి.సుధాకర్, ఎ.పులికొండ, ఎస్ఎం.బాషా, ఎ.నరసింహులు, జి.సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ, తాంద్ర విక్రమ్, మాజీ ఎంపిటిసి దడియాల ఆదినారాయణ, తెలుగు యువత నాయకులు కోడూరు నీలకంఠారెడ్డి, తీరంపురం నీలకంఠ, గండికోట లక్ష్మణ్, మధురాజ్, సుబహాన్, చాంద్‌బాషా, వాల్మీకి కృష్ణమూర్తి, ఫైబర్ చందు, ఫిరోజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు ఆవులాంపల్లి కేశవరెడ్డి, బాలిరెడ్డి, కునాకృష్ణారెడ్డి, నారాయణస్వామి, బషా, లక్ష్మీనారాయణ, చిరంజీవి, రవిశేఖరెడ్డి, ఇటికనేల నరేంద్ర, వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పశుగ్రాసం దగ్ధం

పెద్దవడుగూరు : మండలంలోని చిత్రచేడులో మొద్దుగాళ్ల నాగేంద్రకు చెందిన పశుగ్రాసానికి శుక్రవారం అర్ధరాత్రి నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమైనట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అర్ధరాత్రి మంటలు వ్యాపించడంతో గుర్తించిన కొందరు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సుమారు రూ.50వేలు దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కొడుకుతో సహా తల్లి అదృశ్యం

అనంతపురం క్రైం : కొడుకుతో సహా తల్లి అదృశ్యమైన ఘటన నగరంలోని సత్యదేవనగర్‌లో చోటు చేసుకుంది. 4వ పట్టణ సీఐ కనుమూరి సాయినాథ్ తెలిపిన వివరాల మేరకు.. దూదేకుల షేక్షావలి, కటిక అఖిల దంపతులకుషాకీర్ అనే మూడు సంవత్సరాల కొడుకు ఉన్నాడు. ఈనేపథ్యంలో అఖిల తన కొడుకుతో కలిసి ఈనెల 13వ తేదీ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో గాలించి దొరక్కపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా తెలిస్తే 4వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ సాయినాథ్ సెల్..93460 10581, హెడ్ కానిస్టేబుల్ రవి సెల్.. 99488 23346, అఖిల భర్త షెక్షావలి సెల్..88851 65226 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.